## నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నారాయణఖేడ్, నవంబర్ 28 : ఈ నెల 29న నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో ఉదయం 11నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. ఆర్టీసీ సేవలను మరింత మెరుగైన రీతిలో కొనసాగించేందుకు అవసరమైన సూచనలు చేసేందుకు 9440149896కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కంగ్టి, నవంబర్ 28 : మండలంలో అమల్లోకి వచ్చిన 144సెక్షన్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై విశ్వజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 144 సెక్షన్ ఉన్నందున ఐదుగురికి మించి మనుషులు గుమిగూడవద్దన్నారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు సోషల్‌మీడియాలో రాజకీయ పరంగా ఎలాంటి పోస్టులు పెట్టవద్దన్నారు. గురువారం జరిగే పోలింగ్‌లో ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## గుండ్లమాచునూర్‌లో పోలీసుల కవాతు

హత్నూర, నవంబర్ 28 : మండలం గుండ్లమాచునూర్‌లో మంగళవారం సాయంత్రం పోలీసు కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు కవాతు నిర్వహిస్తునట్లు హత్నూర ఎస్ఐ సుభాశ్ తెలిపారు. 60 మంది పోలీసు సిబ్బందితో గ్రామంలో కవాతు నిర్వహించారు.

## తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

హత్నూర, నవంబర్ 28 : తాళం పగులగొట్టి నగదు ఎత్తికెళ్లిన సంఘటన మండలంలోని మంగాపూర్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నీరుడి ఆంజనేయులు సోమవారం రాత్రి కార్తికమాసం పురస్కరించుకొని నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో జరిగే లక్షదీపారాదన కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో తాళం పగులగొట్టి పెట్టెలో దాచిన రూ. 30వేలు, బీరువాలో నుంచి రూ. లక్షా 70వేలు దోచుకెల్లారని తెలిపారు. వడ్లు అమ్మగా వచ్చిన డబ్బులతో పాటు ఇంట్లోని నగదును దోచుకెళ్లడంతో బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఆంజనేయులు తెలిపాడు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బొల్లారం, నవంబర్ 28 : బొల్లారం మున్సిపాలిటీకి చెందిన ఆసిఫ్ (32) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సంఘ సేవకులు, బీఆర్ఎస్ మున్సిపల్ యువత నాయకుడు ఆనంద్ కృష్ణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పేద కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

## ఎడ్ల బండిపై నాయకులు ప్రచారం

సిర్గాపూర్, నవంబర్ 28 : మడలంలోని లక్ష్మణ్‌నాయక్‌తండా గ్రామ పంచాయతీలో సర్పంచ్ సోనీబాయి, బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఎడ్ల బండిపై ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు తండా నుంచి పక్కనే ఉన్న విఠల్‌నాయక్‌తండాకు ఎడ్ల బండిపై వెళ్లారు. ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అదే విధంగా సిర్గాపూర్‌తో పాటు అన్ని గ్రామాల్లో ర్యాలీలు, బైక్ ర్యాలీ కార్యక్రమాలు చేపట్టారు. ఇది ఇలా ఉండగా మండలంలోని కిషన్‌నాయక్ తండాలో మాత్రం స్థానిక సర్పంచ్ జగ్గురాం, ఎంపీటీసీ పుండ్లిక్, జైపాల్ ఆధ్వర్యంలో స్థానిక శివారులో రైతులకు సాగు చేసి పొలంలో నుంచి తండా వరకు గులాబీ జెండాలు పట్టుకోని ర్యాలీ నిర్వహించారు.


ఎడ్ల బండిపై విఠల్‌నాయక్ తండాకు వెళ్తున్న నాయకులు


పొలంలో ప్రచారం చేస్తున్న కిషన్ నాయక్‌తండా సర్పంచ్, ఎంపీటీసీ


అందోల్ : జోగిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్


మనూరు : ఉప సర్పంచ్‌కు పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# ఆశీర్వదించి అవకాశమివ్వండి

- కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై ఆ పార్టీ అభ్యర్థికే నమ్మకం లేదు
- కాంగ్రెస్ ప్రచారం పాలపొంగు వంటిదే
- బీఆర్ఎస్ అభ్యర్థి మహారెడ్డి భూపాల్ రెడ్డి
- ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్

నారాయణఖేడ్, నవంబర్ 28: కాంగ్రెస్ ప్రకటించిన మ్యానిఫెస్టోపై ఆ పార్టీ అభ్యర్థికే నమ్మకం లేదని ఇక ప్రజలు ఎలా నమ్ముతారని నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలతో పాటు నారాయణఖేడ్ మున్సిపాలిటీలో పర్యటించి అనంతరం రాజీవ్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన రోడ్‌షోలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ జారీ చేసిన మ్యానిఫెస్టోపై స్థానిక కాంగ్రెస్ అభ్యర్థికి నమ్మకం లేదన్నారు. నియోజకవర్గ ప్రజలు నిజాయతీపరులని, చేసిన మంచిని మరువరనే విశ్వాసం తనకుందన్నారు. అసంపూర్తి పనులు పూర్తి కావాలంటే కారు గుర్తుకు ఓటేసి తిరిగి తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రజల్లో బీఆర్ఎస్‌కు మంచి ఆదరణ ఉందని, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారమంతా పాలపొంగు వంటిదన్నారు. ప్రజల ఆశీర్వాదంతో నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడంతో పాటు హ్యాట్రిక్ సీఎంగా మళ్లీ కేసీఆర్‌కు పట్టం కట్టడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే కూతురు శ్రేయారెడ్డి ఆధ్వర్యంలో యువకులు పట్టణంలోని శివాజీచౌక్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

**ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి, మన్సూర్‌పూర్, మంగల్‌పేట్‌లతో పాటు మండలపరిధిలోని పంచగామలో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ ఈ నెల 30న నిర్వహించే ఎన్నికల పోలింగ్ సందర్భంగా కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిద్దుకోవడంలో భాగస్వాములు కావాలని కోరారు.

**అవ్వ పింఛన్ వస్తుందా...**

అందోల్, నవంబర్ 28 : అవ్వ పింఛన్ వస్తుందా.. అక్క చెల్లి పెళ్లికి కల్యాణలక్ష్మి వచ్చిందా..? తాత ఆరోగ్యం ఎలా ఉంది.. అమ్మ కారుకు ఓటేసి మల్లొక్కపారి కేసీఆర్ సారును గెలిపియ్యాలే అంటూ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్ అందరినీ అప్యాయంగా పలుకరిస్తూ చిరు వ్యాపారులు ప్రజలతో ముచ్చటించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, నియోజకవర్గంలో చేపిట్టిన పనులు.. చేపట్టాల్సిన పనులను ప్రచారంలో ప్రజలకు వివరించారు. మంగళవారం జోగిపేట పట్టణంతో పాటు మండలంలోని బొమ్మరెడ్డిగూడెం, లక్ష్మీసాగర్ తండాల్లో కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతితో కలిసి ప్రచారం నిర్వహించారు. క్రాంతికిరణ్ అవ్వ పింఛన్ వస్తుందా అని ఓ వృద్ధురాలిని ప్రశ్నించగా వస్తుంది బిడ్డా అదే నాకు ఆదేరువైంది.. కష్టకాలంలో పింఛన్ అందిస్తున్న కేసీఆర్‌ను ఎన్నడూ మరువం.. మా ఓటు ఆయనకే వేస్తామంటూ ఎమ్మెల్యేను అప్యాయంగా దగ్గరకు తీసుకుంది. చిరు వ్యాపారులు, మహిళలు, వృద్ధులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోయి ఘోసపడ్తామని ప్రజలు ఆలోచించి ఓటేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మల్లికార్జున్, నాగభూషణం, నాయకులు పాల్గొన్నారు.


అందోల్ : క్రాంతికిరణ్‌ను అప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు


కంగ్టి, : సిద్దంగిర్గ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నారాయణఖేడ్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా పంచగామలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


ప్రచారంలో భాగంగా కుండ తయారీ యంత్రాన్ని తిప్పుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


అందోల్: మీట్ షాపు వద్ద ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతి కిరణ్